సాక్షి
అనంతపురం
బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024



వారి చేతిలో పండు భద్రం

ఢిల్లీ దోసకాయల కోత, ప్యాకింగ్ చేయడంలో బెళుగుప్ప మండలం కాలువపల్లి కూలీలు నిష్ణాతులుగా పేరుగాంచారు. 8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/14.1°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

జెడ్పీ పరిధిలో పదోన్నతులకు పచ్చజెండా

- 46 మంది అటెండర్లకు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లుగా అవకాశం



జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యింది. ప్రమోషన్ల కోసం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న జెడ్పీ సహా ఉన్నత పాఠశాలలు, అనుబంధ శాఖల (పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్) అటెండర్ల కల సాకారమయ్యే సమయం దగ్గర పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చొరవతో వీరి పదోన్నతులకు మోక్షం లభించింది. జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి సూచనల మేరకు డిప్యూటీ సీఈఓ లలిత బాయి, ఏ సెక్షన్ అధికారులు పదోన్నతులకు సంబంధించిన ప్యానల్ లిస్ట్ సిద్ధం చేశారు. ఆ తరువాత ఎంతమంది అర్హత ఉన్నారు, ఎన్ని పోస్టులు భర్తీ చేయవచ్చో సమగ్ర నివేదిక రూపొందించారు. రోస్టర్ కూడా పరిగణనలోకి తీసుకున్నారు. జాబితా సిద్ధం కాగా, జెడ్పీ చైర్‌పర్సన్ ఆమోదం కోసం ఫైల్ పంపారు. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 46 మంది అటెండర్లకు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లుగా పదోన్నతులతో పాటు స్థానాలు కూడా కేటాయించనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం రెండు మూడో రోజుల్లో పూర్తి కానున్నట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి.

ఏప్రిల్‌లో టీసీసీ పరీక్షలు

- దరఖాస్తుకు ఫిబ్రవరి 29 వరకు గడువు



అనంతపురం ఎడ్యుకేషన్: టీసీసీ–2024 (డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు) పరీక్షలు ఏప్రిల్‌లో జరుగుతాయని డీఈఓ వి.నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇతర రాష్ట్రాలు/బోర్డులు జారీ చేసిన ఉత్తీర్ణత సర్టిఫికెట్లు కలిగి ఉన్న అభ్యర్థులు లోయర్, హయ్యర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్, అమరావతి నుంచి ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు లోయర్ గ్రేడ్ పరీక్షకు అర్హులని, లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్ష (లేదా) లోయర్ గ్రేడ్ పరీక్షకు సమానమైన ఉత్తీర్ణత సాధించిన వారు సంబంధిత హయ్యర్ గ్రేడ్ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో దరఖాస్తు చేసుకుని, డౌన్‌లోడ్ చేసిన వెబ్ అప్లికేషన్‌ను ఫిబ్రవరి 29లోగా నగరంలోని కమలానగర్‌లో గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం (పాత భవనం)లో అందజేయాలని సూచించారు.

ఎరువుల విక్రయాలు నిలిపివేత



పురుగు మందులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

ఆత్మకూరు: సరైన అనుమతులు లేకుండా విక్రయానికి ఉంచిన 175 బస్తాల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేస్తూ ఏడీఏ రవి ఆదేశాలు జారీ చేశారు. వివరాలు... ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి సుచరితతో కలసి మంగళవారం ఉదయం స్థానిక పి.యాలేరు రోడ్డు సమీపంలో ఉన్న వెంకట్ ఆగ్రో ట్రేడర్స్‌లో ఏడీఏ రవి తనిఖీలు చేపట్టారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో సరైన అనుమతులు పొందకుండా విక్రయానికి ఉంచిన 175 బస్తాల ఎరువులను గుర్తించి వాటి విక్రయాలను నిలుపుదల చేశారు. వీటి విలువ దాదాపు రూ.2,62,309 అని ఈ సందర్భంగా ఏడీఏ తెలిపారు. రైతులు తీసుకున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పంపనూరులో రబీ సీజన్ కింద చేపట్టిన పంట సాగుకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సుజిత, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పదిపై పంచతంత్రం

- ఉత్తమ ఫలితాలపై కేజీబీవీ విద్యార్థినుల గురి
- అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు





చదువుకుంటున్న కేజీబీవీ విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నిచ్చెన లాంటివి. విద్యార్థుల జీవితాలు మలుపు తిరిగేది ఇక్కడే. ఇంతటి ప్రాధాన్యత ఉండడంతోనే జిల్లా కలెక్టర్ గౌతమి 'పది'పై ప్రత్యేక దృష్టి సారించారు. పూర్తిగా వెనుకబడిన పిల్లలను సైతం కనీస మార్కులతోనైనా గట్టెక్కించేలా చూడాలంటూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రణాళిక మేరకు సన్నద్ధమైతే ఉత్తీర్ణత మార్కులు సాధించడం పెద్ద సమస్య కాదు. ప్రత్యేక తరగతులు, ప్రణాళిక అంటూ ఉపాధ్యాయులు విద్యార్థుల వెంటపడుతుంటారు. ముఖ్యంగా విద్యాశాఖ 'అనంత సంకల్పం' పేరుతో మెటీరియల్ తయారు చేయించి డిసెంబరు 11 నుంచి ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ స్ఫూర్తితో జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీల) విద్యార్థినులను సన్నద్ధం చేస్తున్నారు. అలాగే 'పంచతంత్రం' పేరుతో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఈసారి వీలైనంతమంది విద్యార్థినులు 500 పైబడి మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నామని ప్రత్యేక అధికారులు (ఎస్ఓలు) చెబుతున్నారు.

పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

జిల్లాలోని 32 కేజీబీవీల్లో 1,263 మంది పదో తరగతి విద్యార్థినులు, 2,063 మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు చదువుతున్నారు. విద్యాశాఖ అమలు చేస్తున్న 'అనంత సంకల్పం'తో పాటు సమగ్రశిక్ష ప్రత్యేకంగా రూపొందించిన 'పంచతంత్ర' ప్రణాళికను అమలు చేస్తున్నారు. కేజీబీవీలో పని చేస్తున్న ఎస్ఓ, సీఆర్టీలు దత్తత తీసుకున్నారు. ఒక్కొక్కరు కనీసం 5 నుంచి 15 మంది విద్యార్థినులను దత్తత తీసుకున్నారు. వారి పరిధిలోని విద్యార్థినులు ఎలా చదువుతున్నారు.. ఏ సబ్జెక్టులో వెనుకబడ్డారు తదితర అంశాలను దత్తత తీసుకున్న టీచర్లే పరిశీలిస్తారు. లోపాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటారు. ఈ మొత్తం కార్యక్రమం అమలును గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీఓ) మహేశ్వరి పర్యవేక్షిస్తున్నారు.

'పంచతంత్రం' ప్రణాళిక

కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు 'పంచతంత్ర' ప్రణాళిక తయారు చేశారు. వంద రోజుల ఈ కార్యక్రమం గత నెలలోనే ప్రారంభమైంది. పాఠ్యాంశాల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. ఇందులో స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షలు, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేకశ్రద్ధ, ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల సమావేశాలు కీలకంగా ఉన్నాయి. ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు రూ. 5 వేలు, వందశాతం ఫలితాలు సాధించిన కేజీబీవీలకు రూ.50 వేల నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే వందశాతం ఉత్తీర్ణత సాధించే జీసీడీఓలకు సన్మానం చేయనున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఈసారి కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. ఇందుకోసం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలంటే కలిగే భయాన్ని తొలగించాం. అన్ని కేజీబీవీల్లో విద్యార్థినులు పోటీ పడి చదువుతున్నారు. కచ్చితంగా ఈసారి మంచి ఫలితాలు సాధిస్తాం. వీలైనన్ని బహుమతులకు విద్యార్థినులు ఎంపికవుతారని ఆశిస్తున్నాం.

– మహేశ్వరి, జీసీడీఓ, సమగ్రశిక్ష

పాల నాణ్యత మేరకు ధర

- మిల్క్ యాక్ట్‌పై పశు సంవర్ధక శాఖ అధికారులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జేడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: పాల నాణ్యతను బట్టి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాల్సిన బాధ్యత పశు సంవర్ధక శాఖ అధికారులపై ఉందని ఆ శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం నగరంలోని పశు సంవర్ధక శాఖ డీడీ కార్యాలయ హాలులో ఆ శాఖ ఏడీలు, పశువైద్యులకు 'మిల్క్ యాక్ట్'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేడీతో పాటు రిసోర్సు పర్సన్లు డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్ అవగాహన కల్పించారు. మిల్క్ యాక్ట్‌లో భాగంగా తూనికలు, కొలతల శాఖ మాదిరిగానే ఇక నుంచి పశు వైద్యులు మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పాల సేకరణ కేంద్రాలు, డెయిరీలు తనిఖీ చేయాలన్నారు. అందులో మిషనరీలు సక్రమంగా పనిచేస్తున్నాయా, నిబంధనల మేరకు నాణ్యతను బట్టి ధర ఇస్తున్నారా లేదా అనేది చూడాలన్నారు. క్రమం తప్పకుండా సామగ్రి మార్చుకోవడం, నిర్ణీత పద్ధతిలో పనిచేసేలా చేయాలన్నారు. అంతిమంగా రైతులకు ప్రయోజనం కలిగేలా మిల్క్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ కె.వెంకటేష్, డాక్టర్ టి.సుధాకర్, ఏడీలు రత్నకుమార్, నాగార్జునరెడ్డి, సురేష్, పద్మనాభం, లక్ష్మీకాంతమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, చిత్రంలో సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు

- జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- వైఎస్సార్‌సీపీ విజయానికి శాయశక్తులా కృషి
- మీడియాతో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎం.వీరాంజనేయులును నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపిక చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి మీడియాతో మాట్లాడారు. వీరాంజనేయులు ఒక సామాన్య కుటుంబానికి చెందిన వారన్నారు. ఆయన తండ్రి వెంకటప్ప గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా పనిచేశారని, టీడీపీ నాయకులు ఇబ్బందులకు గురి చేసినా వైఎస్సార్‌సీపీ పటిష్టతకు, పంచాయతీ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. తమ్ముడి లాంటి వీరాంజనేయులుకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. టికెట్ వస్తే ఒకలా.. రాకుంటే మరోలా ఉండే స్వభావం తనది కాదన్నారు. పార్టీ నిర్ణయాలకు లోబడే తాను ముందుకెళ్తున్నట్లు చెప్పారు. పేదలకు చేస్తున్న మేలులో భాగస్వాములు కావాలన్నదే తమకు ముఖ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. జగనన్న సీఎంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. గత పాలకులు శింగనమల అభివృద్ధిని విస్మరించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో శింగనమల చెరువు లోకలైజేషన్, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు.

బడుగులకు స్వర్ణయుగం

వైఎస్సార్ కాంగ్రెస్ పాలన బడుగు, బలహీనవర్గాలకు స్వర్ణయుగం లాంటిదని పార్టీ శింగనమల సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు అభివర్ణించారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు సమన్వయకర్తగా అవకాశం కల్పించడం వరంగా భావిస్తున్నానన్నారు. అణగారిన వర్గాలను ఉన్నతస్థాయిలో చూడాలన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆర్థిక ప్రగతి సాధించేలా విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ, పార్టీ కోశాధికారి ఎం.శ్రీనివాసులు నాయక్, నాయకులు నరేంద్ర, వజ్రం గంగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎంపీడీఓలను తక్షణం రిలీవ్ చేయండి

- కలెక్టర్ గౌతమి ఆదేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీఓలను తక్షణం రిలీవ్ చేయాలని అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి సహా మండల పరిషత్ అధికారులను ఆదేశిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సొంత జిల్లాతో పాటు మూడేళ్లు ఒకే జిల్లాలో పని చేసిన ఎంపీడీఓలందరినీ బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 38 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. వీరిలో వైఎస్సార్ జిల్లాకు 15 మంది, కర్నూలు జిల్లాకు 23 మంది బదిలీ అయ్యారని, వీరందరినీ తక్షణం రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. బదిలీ అయిన ఎంపీడీఓలు ఆలస్యం కాకుండా పాలనాధికారుల(ఏఓలు)కు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఏఓలు లేని మండలాల్లో ఈఓపీఆర్‌డీలకు బాధ్యతలు అప్పగించి తప్పుకోవాలని పేర్కొన్నారు.

- వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీఓలలో కె.జ్యోత్స్న, జీఎస్ రామచంద్ర, ఎస్.షకీలాబాను, బి.విజయభాస్కర్, ఎస్.నరసింహమూర్తి, పీడీ శ్రీనివాసులు, జి.లక్ష్మీనరసింహ, డి.ప్రభాకర్, బి.రామకృష్ణ, పి.కుళ్లాయిస్వామి, టి.యోగానందరెడ్డి, బి.నిర్మల కుమారి, ఎ.వెంకటరంగారావు, పి.దివాకర్, జె.సాల్మన్ ఉన్నారు.
- కర్నూలు జిల్లాకు బదిలీ అయిన వారిలో బి.శకుంతల, వి.సరస్వతి, బి.విజయలక్ష్మి, ఎస్.గంగావతి, సీఎల్ సోనీబాయి, కొండన్న, కేవీ కవిరాజ్, ఎ.వి.శ్రీనివాసులు, టి.లక్ష్మీనారాయణ, బీవీ రవిప్రసాద్, జి.మునెప్ప, ఎస్.సాయిమనోహర్, కేఎన్ నరేష్ కృష్ణ, డి.రామారావు, పి.నరేంద్రకుమార్, టి.అలివేలమ్మ, ఎస్.బారాన్ సాహెబ్, ఎం.నరసింహనాయుడు, ఎస్.శివశంకరప్ప, రాబర్ట్ విల్సన్, కె.ఆజాద్, బి.కిరణ్‌మోహన్ రావు, ఎస్.రఘునాథగుప్తా ఉన్నారు.

సీఎం జగన్‌తోనే మహాత్ముడి ఆశయ సాధన



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శంకరనారాయణ, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్య్రాలు అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం గాంధీజీ చిత్రపటాన్ని ఉంచి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులతో కలసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. పేదరికం నిర్మూలనకు వివిధ సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.40 లక్షల కోట్ల లబ్ధిని లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని చేసుకుని పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం కల్పించి సర్వజన హితం తన మతమని గాంధీజీ వ్యాఖ్యలను నిజం చేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ ... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయాల ద్వారా 450 రకాల పౌర సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ మునీరా, నాయకులు వనారస బలరాం, గుజ్జల శివయ్య, చిదంబరరెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, కుమ్మరి ఓబులేసు, సాకే ఆంజనేయులు, యల్లనూరు ప్రసాద్, శివారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

171 మంది వీఏహెచ్‌ఏల బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 171 మంది బదిలీ అయ్యారు. మంగళవారం అనంతపురంలోని పశుశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్, నలుగురు డీడీల సమక్షంలో వీఏహెచ్‌ఏల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. మూడేళ్ల క్రితం నియమితులైన 219 మంది ఉమ్మడి జిల్లా పరిధిలో ఆర్‌బీకే అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. తాజాగా 445 మంది వీఏహెచ్‌ఏలుగా నియమితులయ్యే అవకాశముంది. ఈ క్రమంలో ఇప్పటి వరకూ పనిచేస్తున్న వారికి బదిలీ అవకాశం కల్పించారు. దీంతో రెండు జిల్లాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న 171 మందిని బదిలీ చేశారు. వీరందరికీ బుధవారం బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఖాళీలను బట్టి రెండు, మూడు రోజుల్లో కొత్త వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

షికారీల స్థితిగతులు మారుస్తాం



మహిళలతో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: షికారీల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడం ద్వారా వారి స్థితిగతులు మారుస్తామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ స్పష్టం చేశారు. అనంతపురంలోని టీవీ టవర్ సమీపంలో షికారీలు నివాసముంటున్న ప్రాంతాన్ని జేసీ మంగళవారం సందర్శించారు. వారి జీవన శైలి, స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం షికారీ కుటుంబాలతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. నివాసముంటున్న గుడారాల్లాంటి ఇళ్లను పరిశీలించారు. ఎంతకాలం నుంచి నివసిస్తున్నారు? ప్రభుత్వ పథకాలు వర్తిస్తున్నాయా? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. షికారీల స్థితిగతులు మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. లబ్ధిదారుల డేటా ప్రకారం ఉప్పరపల్లి వద్ద ఇంటి స్థలం కేటాయించడంతో పాటు పట్టా మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బాల కిషన్, విజయలక్ష్మి, సీఐ విశ్వనాథ్‌చౌదరి పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయానికి సర్కారు ప్రోత్సాహం
- రైతులూ ఆసక్తి చూపుతుండటం శుభపరిణామం
- అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం వెల్లడి



పొలంలో ముల్లంగిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కూడేరు: ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం సంతోషంగా ఉందని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపింది. శాస్త్రవేత్తల బృందం మంగళవారం కూడేరు మండలం చోళసముద్రంలో పర్యటించింది. రైతు శంకరయ్య ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించింది. రసాయనిక మందులతో చీనీ సాగు చేస్తే ఐదేళ్లలో పంట దిగుబడి వస్తుందని, కానీ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రెండున్నరేళ్లకే కాయ కోతకు వస్తుందని రైతు వివరించారు. చీనీలో అంతర పంటగా సాగు చేసిన ముల్లంగి, వంకాయ, మరో 20 సెంట్లలో ముల్లంగి, క్యారెట్, మొక్కజొన్న పంటలు కూడా మంచి దిగుబడి వచ్చాయన్నారు. అనంతరం పెన్నోబులేసు 8 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన పండ్ల మొక్కలు, కూరగాయలు, ఆకుకూరల పంటలను బృందం పరిశీలించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు లాభసాటిగా ఉన్నాయని చెప్పిన రైతును శాస్త్రవేత్తలు అభినందించారు. తర్వాత రైతు భరోసా కేంద్రంలో రైతులు, స్వయం సహాయక సంఘం సభ్యురాళ్లతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్రను అడిగి తెలుసుకున్నారు.

ప్రపంచ సవాళ్లకు సమాధానం ప్రకృతి వ్యవసాయం

'ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానం ఇసుక నేలలు, బీడు భూములను సారవంతం చేసి గ్రామీణుల వలసలను తగ్గిస్తోంది. మరోపక్క ప్రపంచానికి సవాల్‌గా నిలిచిన వాతావరణ మార్పు యాజమాన్యానికి కూడా దోహదపడుతోంద'ని బృందం సభ్యులైన షార్జా రాజ కుటుంబానికి చెందిన షేఖ్ మాజీద్ అలఖ్ అస్సిమి, ఇటలీకి చెందిన ఫ్యూచర్ ఎకానమీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్టర్ లింక్, మాజీ అసోసియేట్ యాజెన్ అల్ కొద్మని, ప్రపంచ బ్యాంక్ సీనియర్ సలహాదారులు నలిన్ కిశోర్, అశోక్ వైష్, దేశ్‌దీప్ సహదేవ్ పేర్కొన్నారు. రసాయనిక మందులు, ఎరువుల వాడకంతో నేల, నీరు, వాతావరణం కలుషితమై జీవరాశుల మనుగడే ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ విధానానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతులను ప్రోత్సహించడం శుభదాయకమన్నారు. ఈ పద్ధతిపై రైతులు కూడా ఆసక్తి చూపుతున్నట్లు తమ పర్యటనలో గమనించామన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్, ది మాటిక్ లీడ్ సురేష్, ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ ఏఓ కృష్ణ చైతన్య, స్టేట్ రిసోర్స్ పర్సన్ నరేంద్ర, ఎస్‌ఎఫ్‌ఏ భానుమతి, సురేష్, ఏఓ విజయకుమార్, ఎంసీఏ వెంకటేష్, ఎంఏ కుళ్లాయప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న రెవెన్యూ సిబ్బంది


రోడ్డు పక్కన కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధురాలు

గుంతకల్లు రూరల్: కుటుంబసభ్యులు రోడ్డు పక్కన వదిలేయడంతో మూడు రోజులుగా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న ఓ వృద్ధురాలిని రెవెన్యూ సిబ్బంది అక్కున చేర్చుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతన్న వృద్ధురాలిని వదిలించుకునే క్రమంలో గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై వదిలి వెళ్లారు. కదల్లేని స్థితిలో ఉన్న ఆమె అలాగే ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ మూడు రోజులుగా అక్కడే ఉండిపోయింది. మంగళవారం అటుగా విధులకు వెళ్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆమెను గమనించి మాట్లాడే ప్రయత్నం చేశారు. సమాధానం ఇవ్వలేని ఆమె దుస్థితిని గమనించి తహసీల్దార్ ప్రతాపరెడ్డి సూచన మేరకు 108 అంబులెన్స్ వాహనంలో గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ఆమె ఖర్చుల నిమిత్తం రూ.2 వేలను తహసీల్దార్ ప్రతాపరెడ్డి అందజేశారు.

నీటిలో పడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంతకల్లు రూరల్: ప్రమాదవశాత్తు నీటిలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు – గుత్తి మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న గొల్లలదొడ్డినుంచి వైటీ చెరువుకు వెళ్లేదారిలో ఉన్న కాలువలో ఓ గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న గుంతకల్లు రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మల విసర్జనకు వెళ్లి మద్యం మత్తులో నీటిలో జారి పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి జేబులో కర్ణాటకకు చెందిన గోల్డెన్ బీడీల కట్ట ఉంది. నీలం రంగు టీషర్ట్, తెల్లని చెక్స్ కలిగిన ప్యాంటు ధరించి ఉన్నాడు. గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 93469 17089, 94407 96824కు సమాచారం అందించాలని రూరల్ ఎస్ఐ సురేష్ కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


ఆదినారాయణ (ఫైల్)

రాప్తాడు: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాప్తాడు మండలం బొమ్మేపర్తికి చెందిన ఆసాది ఆదినారాయణ (61), నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. ప్రస్తుతం అనంతపురంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న ఆదినారాయణ మంగళవారం ఉదయం చిన్న కుమార్తెను చూసేందుకు బొమ్మేపర్తికి వచ్చాడు. అల్లుడు నాగరాజు, ఆయన కుటుంబసభ్యులతో కాసేపు గడిపి తన టీవీఎస్ మోపెడ్పై తిరుగు ప్రయాణమయ్యాడు. లింగనపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపైకి చేరుకోగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ఆసాది ఆదినారాయణ రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి పడ్డాడు. తల నేరుగా బండరాయిని తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వారి చేతిలో పండు భద్రం


అనంతపురం సమీపంలోని అయ్యవారిపల్లి వద్ద ఢిల్లీ దోస కాయలను ప్యాక్ చేస్తున్న కాలువపల్లి కూలీలు

- ఢిల్లీ దోస ప్యాకింగ్లో కాలువపల్లి వాసులది అందెవేసిన చేయి
- ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ సేవలు

సాక్షి, అనంతపురం డెస్క్ : 'ఢిల్లీ దోస' .. ఈ పంట ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో బాగానే సాగవుతోంది. పసుపు పచ్చ రంగులో నిగనిగలాడే కోహినూరు రకం దోసకాయలకు ఢిల్లీ ప్రాంతంలో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇవి 'ఢిల్లీ దోస'గా స్థిరపడ్డాయి. ఈ పంటను ఉమ్మడి జిల్లా రైతులే కాకుండా.. కర్నూలు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70 వేలు పెట్టుబడి పెడితే.. నికరాదాయం రూ.1.10 లక్షల నుంచి రూ.1.40 లక్షల వరకు వస్తుంది. ఈ పంట సాగు ఒక ఎత్తయితే..దోసకాయలను మార్కెట్టుకు తరలించడం మరోఎత్తు. కాయ నాణ్యత ఏమాత్రమూ దెబ్బతినకుండా జాగ్రత్తగా ప్యాక్ చేసి తరలించాల్సి ఉంటుంది. ప్యాకింగ్ను బట్టే కాయనాణ్యత, ధర ఆధారపడి ఉంటాయి. దీంతో రైతులు, వ్యాపారులు ప్యాకింగ్పై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. ఈ పని సాధారణ కూలీలు చేయలేరు. నిష్ణాతులైన వారు చేస్తేనే దోసకాయకు భద్రత ఉంటుంది.

ప్యాకింగ్లో కింగ్లు..కాలువపల్లి వాసులు

ఢిల్లీ దోసకాయల పంట కోత, ప్యాకింగ్లో బెళుగుప్ప మండలం కాలువపల్లి వాసులు నైపుణ్యం సాధించారు. గ్రామంలో సుమారు రెండు వేల జనాభా ఉండగా..300 మంది దాకా కూలీలు ఈ పనిలో రాటుదేలారు. వీరిని చూసి పక్కనే ఉండే కళ్యాణదుర్గం మండలం మానిరేవు గ్రామానికి చెందిన కొందరు కూలీలు కూడా ఈ మార్గాన్నే ఎంపిక చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఢిల్లీ మార్కెట్లో కూడా 'కాలువపల్లి' ప్యాకింగ్ అంటేనే వ్యాపారులకు ఓ నమ్మకం ఏర్పడింది. దీంతో ఈ గ్రామ కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పంట కోతలు, ప్యాకింగ్ కోసం రైతులు వీరి వద్దకు క్యూకట్టే పరిస్థితి. ఒక్కో లారీకి రెండు వేల బాక్సులు నింపాల్సి ఉంటుంది. 20 మంది కూలీలు సులువుగా ఈ పని పూర్తిచేస్తారు.

కొందరితో మొదలై...

పదేళ్ల క్రితం ఢిల్లీ నుంచి వచ్చిన ఏజెంట్ల ద్వారా దోసకాయల కోతలు, ప్యాకింగ్లో మెలకువలను కాలువపల్లికి చెందిన కొందరు కూలీలు తెలుసుకున్నారు. ఏ దశలో కోత కోస్తే ఢిల్లీ మార్కెట్టుకు వెళ్లే వరకు కాయలు సురక్షితంగా ఉంటాయి, సైజుల వారీగా బాక్సులను ఎలా నింపాలి? ఒక లారీకి ఎన్ని బాక్సులను లోడ్ చేయాలి? ఎన్ని ఎకరాల దిగుబడి ఒక లారీకి సరిపోతుందన్న అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకున్నారు. వీరికి పనులు బాగా దొరకడంతో గ్రామంలో చాలామంది ఇదే బాటలో నడిచారు. ఇప్పుడు పక్క గ్రామాల కూలీలు సైతం వీరిని అనుసరిస్తున్నారు.

ఉపాధికి ఢోకా లేదు


దోసకాయల ప్యాకింగ్ నిపుణులుగా మారిన తర్వాత కాలువపల్లి కూలీల ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. ఏడాదిలో మూడు నెలలు మినహా మిగిలిన రోజుల్లో నిరంతరం పనులు ఉంటాయి. దీంతో మంచి ఆదాయం పొందుతున్నారు. ఆర్థికంగా ఎదుగుతున్నారు. పిల్లలను కూడా బాగా చదివించుకుంటున్నారు.

చేతినిండా పని ఉంటోంది



దోసకాయల కటింగ్, ప్యాకింగ్లో మాకు మంచి గుర్తింపు వచ్చింది. ఒక్కో బాక్సులో కాయ సైజును బట్టి 5 నుంచి 11 వరకు ప్యాక్ చేస్తాం. ఇందులో పాటించే మెలకువల వల్ల కాయ సురక్షితంగా మార్కెట్టుకు చేరుతుంది. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల రైతులు కూడా మమ్మల్ని సంప్రదిస్తున్నారు. దీంతో చేతినిండా పని ఉంటోంది.
– సోమశేఖర్, మేస్త్రీ, కాలువపల్లి

మంచి ఆదాయం పొందుతున్నా



ఢిల్లీ ఏజెంట్ల ద్వారా ప్యాకింగ్ నేర్చుకున్నా. నిత్యం పని దొరుకుతోంది. ఒక లారీ కాయలు లోడ్ చేస్తే ఒక్కొక్కరికి రూ.600కు పైగానే కూలి లభిస్తోంది. – రంజాన్, కాలువపల్లి

కుటుంబానికి తోడ్పాటు



మాది వ్యవసాయ కుటుంబం. అయినా నేను ప్యాకింగ్ పనులకు వెళ్తుంటా. తద్వారా వచ్చే ఆదాయంతో మరింత తోడ్పాటు లభిస్తోంది. తొలుత కొందరు సీనియర్లతో కలసి పనులకు వెళ్లి వారి సలహాలు, సూచనలతో మెలకువలు నేర్చుకున్నా. ఇందులో ఎంత పని చేస్తే అంత ఆదాయం ఉంటోంది. – నరేష్, కాలువపల్లి

ఏజెంట్ల ద్వారా కబురు

తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకలో ఎక్కడ పంట కోత ఉన్నా కాలువపల్లి కూలీలకు సమాచారం అందుతుంది. గ్రామంలోనే ముగ్గురు ఏజెంట్లు ఉన్నారు. మానిరేవులో కూడా ఒకరిద్దరు ఏజెంట్లు ఉన్నారు. వీరికి వివిధ ప్రాంతాల్లోని లారీ అసోసియేషన్లు, వ్యాపారులు, బడా రైతులతో సంబంధాలు ఉన్నాయి. దీంతో పంట కోతల సమాచారాన్ని వీరికి చేరవేస్తారు. వీరు ఒక మేస్త్రీ ఆధ్వర్యంలో కొందరు కూలీలను జతచేసి పంపుతుంటారు. రవాణా, భోజన ఖర్చులన్నీ రైతులు లేదా వ్యాపారులే భరిస్తారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.600 నుంచి రూ.వెయ్యి దాకా కూలి లభిస్తుంది.


లారీలో లోడ్ చేస్తున్న దోస బాక్సులు

పనులు వెతుక్కోవాల్సిన అవసరం లేదు



నాతో పాటు గ్రామంలో చాలామంది దోస కాయల ప్యాకింగ్కు వెళ్తున్నాం. ఎక్కడ పనులు ఉంటే అక్కడికి వెళ్లి చేస్తున్నాం. ఏజెంట్లు గ్రామంలోనే ఉండటంతో ఇబ్బందులు లేకుండా పనుల గురించి ముందస్తుగానే సమాచారం అందుతోంది. కూలి పనులు వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా పోయింది.
– అభిలాష్రెడ్డి, కాలువపల్లి

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

ఆత్మకూరు: గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు చేరువ చేయడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. ఆత్మకూరు మండలం సనప గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా గ్రామీణుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సబియా సుల్తానా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

5,887 మందికి వైద్య సేవలు

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో 5,887 మంది ఓపీ సేవలు అందుకున్నారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే బుధవారం ఉదయం అనంతపురంలోని బుడ్డప్పనగర్, ఇందిరాగాంధీ నగర్, మంగళవారి కాలనీ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు గుత్తి చెట్నేపల్లి, గుంతకల్లు సత్యానారాయణపేట, కళ్యాణదుర్గం ఒంటిమిద్ది, రాయదుర్గంలోని కణేకల్లు రోడ్డు, తాడిపత్రి పాతకోట పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


మందులు పరిశీలిస్తున్న డాక్టర్ భ్రమరాంబదేవి

మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలి

మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పిలుపునిచ్చారు. గత నెలలో జరిగిన 2 మాతృ, 6 శిశు మరణాలపై సంబంధిత పీహెచ్సీ వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం తన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. మరణాలకు గల కారణాలపై ఆరా తీశారు. మాతాశిశు మరణాలను ప్రభుత్వం సీరియస్గా పరిగణిస్తోందని, ఈ క్రమంలో గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు జరిగే వరకూ అందించాల్సిన వైద్య సేవలను వివరించారు. ప్రతి పీహెచ్సీ పరిధిలో ప్రతి నెలా 10 ప్రసవాలు జరగాలన్నారు. హైరిస్క్ కేసుల పట్ల ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, జిల్లా ఆస్పత్రుల కో ఆర్డినేటర్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర, చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ శంకర్నారాయణ, డాక్టర్ శారద, ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ణ, ఎంపీహెచ్ఈఎస్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


చంద్రశేఖర్రెడ్డి మృతదేహం

రాప్తాడురూరల్: స్థిరాస్తి భాగ పరిష్కారానికి తమ్ముళ్లు ముందుకు రాకపోవడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లికి చెందిన దివంగత చెన్నారెడ్డికి నలుగురు కుమారులున్నారు. ఆస్తి మొత్తం తమ్ముళ్ల పేరుమీద ఆన్లైన్లో ఉన్నట్లుగా తెలుసుకున్న చెన్నారెడ్డి పెద్ద కుమారుడు పి.చంద్రశేఖరరెడ్డి (60) ఇటీవల తన వాటా భూమిని తన పేరుపై మార్చాలని తమ్ముళ్లను అడిగాడు. అయితే చివరి రోజుల్లో తల్లిదండ్రులను తామే చూశామని ప్రతిఫలంగా తమకు రెండు ఎకరాల భూమి అదనంగా ఇవ్వాలంటూ ముగ్గురిలో ఇద్దరు తమ్ముళ్లు పట్టుబట్టారు. ఈ క్రమంలో పలు పంచాయితీలు జరిగాయి. చివరకు రాప్తాడు, ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్లోనూ ఫిర్యాదు చేశారు. ఆస్తి వివాదం కావడంతో కోర్టు పరిధిలో పరిష్కరించుకోవాలని పోలీసులు వెనక్కు పంపారు. ఈ నేపథ్యంలోనే కందుకూరు సమీపంలో ఏర్పాటవుతున్న ఎంజీ కాలనీకి సంబంధించి వీరి భూమిలో కొంత భాగాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీనికి సంబంధించి పరిహారాన్ని పట్టాదారు పాసుపుస్తకాలున్న చంద్రశేఖరరెడ్డి సోదరుల పేరుపై ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పరిహారం విషయంలోనూ అన్నదమ్ముళ్లు వాదులాడుకున్నారు. తన వాటా భూములు, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన చంద్రశేఖర్రెడ్డి ఇటీవల తన సోదరుడు పంట సాగు చేసేందుకు సిద్ధంగా ఉంచుకున్న స్టార్టర్ పెట్టెను తీసుకెళ్లాడు. తనకు భూములు పంచేదాకా సాగు చేసుకోనివ్వనంటూ తమ్ముడిని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో తమ్ముడు ఇటుకపల్లి పోలీస్స్టేషన్కు చేరుకుని అన్నపై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు చంద్రశేఖర్రెడ్డిని పిలిపించి మాట్లాడారు. స్టార్టర్ పెట్టెను వెనక్కు ఇచ్చేసి ఆస్తి పంపకం విషయం బంధువుల సమక్షంలో మాట్లాడుకోవాలని పోలీసులు హితవు పలికి పంపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖరరెడ్డి ఈ నెల 28న రాత్రి తన తోటవద్దకెళ్లి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

రాజశేఖరరెడ్డికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న విశ్వ (చిత్రంలో) అగ్రి బోర్డు ఏపీ చైర్మన్ అంబటి కృష్ణారెడ్డి


రాజశేఖరరెడ్డి సతీమణి శైలజారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ టి.రాజశేఖరరెడ్డి మృతదేహానికి మంగళవారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. వజ్రకరూరు మండలం కమలపాడులోని ఆయన స్వగృహంవద్ద ప్రజల సందర్శనార్థం రాజశేఖరరెడ్డి మృతదేహాన్ని ఉంచారు. నివాళులర్పించిన వారిలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఆయన కుమారుడు, అగ్రి అడ్వైజరీ బోర్డు ఏపీ చైర్మన్ అంబటి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్రెడ్డి, పామిడి వీరా, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఉరవకొండ మార్కెట్ యార్డు చైర్పర్సన్ సుశీలమ్మ, వైఎస్సార్సీపీ నాయకులు వెంకటరెడ్డి, హనుమంతరెడ్డి, మండల కన్వీనర్ సోమశేఖర్రెడ్డి, వజ్రకరూరు జెడ్పీటీసీ వసికేరి తేజేశ్వరి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ఖాన్, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, తదితరులున్నారు. రాజశేఖర్రెడ్డి సతీమణి శైలజారెడ్డి, కుమారులు సందీప్రెడ్డి, ప్రదీప్రెడ్డిని పరామర్శించారు. అనంతరం రాజశేఖరరెడ్డి అంత్యక్రియల్లో తన కుటుంబసభ్యులతో కలసి విశ్వ పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొన్న వివాహేతర సంబంధం

- అనంతపురం శివారులో యువకుడి దారుణ హత్య
- హతుడి శరీరంపై 15 కత్తిపోట్లు


ఘటనా స్థలంలో రాజేష్ నాయక్ మృతదేహం

రాప్తాడు రూరల్: వివాహేతర సంబంధం ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం జంబులదిన్నె కొట్టాల నివాసి రాజేష్ నాయక్ (32), రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చంద్రబాబు కొట్టాలుకు చెందిన ఎస్.ఆంజనేయులు స్నేహితులు. ఇద్దరికీ వివాహమైంది. ఇద్దరూ చంద్రబాబు కొట్టాలులోనే స్థిర నివాసం ఏర్పరుచుకుని ఆటో డ్రైవర్లుగా జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం రాజేష్ నాయక్ను వదిలి భార్య వెళ్లిపోయింది. అనంతరం రాజేష్ నాయక్ ఆటో డ్రైవింగ్ వదిలేసి జిలేబి మాస్టర్గా పనిచేస్తూ తరచూ ఆంజనేయులు ఇంటికి రాకపోకలు సాగించసాగాడు. ఈ నేపథ్యంలోనే ఆంజనేయులు భార్యతో సన్నిహితం పెరిగింది. వీరిద్దరి వ్యవహారంపై అనుమానం పెంచుకున్న ఆంజనేయులు ఎలాగైనా రాజేష్ నాయక్ను కడతేర్చాలని అనుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిశారు. బైకులో తిరుగుతూ పూటుగా మద్యం తాగారు. అప్పటికే పక్కా ప్రణాళికతో ఉన్న ఆంజనేయులు సరైన ప్రాంతం కోసం పలుచోట్ల తిప్పాడు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరి నగర్ వెనుక ఉన్న సీవీరామన్ జూనియర్ కళాశాల నుంచి కట్టకిందపల్లికి వెళ్లే మార్గంలో నిర్జన ప్రదేశానికి చేరుకోగానే రాజేష్ నాయక్పై కత్తితో దాడి చేశాడు. పొట్ట, ఛాతి భాగాల్లో దాదాపు 15 సార్లు కత్తితో బలంగా పొడవడంతో రాజేష్నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం అక్కడి నుంచి ఆంజనేయులు ఉడాయించాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు రాజేష్నాయక్ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందజేసి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'సైబీరియన్' సందడి

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు సైబీరియన్ పక్షులు చేరుకున్నాయి. ఏటా సైబీరియా నుంచి 5 వేల కి.మీ ప్రయాణించి సంతానోత్పత్తి కోసం వీరాపురానికి పక్షులు చేరుకుంటుండడం విశేషం. ఈ క్రమంలో మంగళవారం సైబీరియన్ పక్షులు వీరాపురానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆరు నుంచి ఏడు నెలల పాటు పక్షులు ఇక్కడే ఉంటాయి.


తుమ్మలకుంట చెరువులో సందడి చేస్తున్న సైబీరియన్ కొంగలు

జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా కమిటీ సమావేశం నేడు

అనంతపురం: జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ ఎం. గౌతమి అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నారు. కలెక్టరేట్లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సంబంధించి కమిటీ సభ్యులు జి. రామచంద్రారెడ్డి (సాక్షి బ్యూరో ఇన్చార్జ్), ఆర్.భోగేశ్వరరెడ్డి (వార్త బ్యూరో ఇన్చార్జ్), పి.శ్రీనివాసులు (ఎన్టీవీ స్టాఫ్ రిపోర్టర్)తో పాటు డీఆర్ఓ, ఆర్డీఓలకు అధికారికంగా సమాచారాన్ని అందజేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ మూడు సెంట్ల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే జర్నలిస్టుల దరఖాస్తు ప్రక్రియ పూర్తయింది. ఈ నేపథ్యంలో స్థలం ఎంపిక, ఇతర అంశాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

రైతు రుణాలకు ప్రాధాన్యత

- డీసీసీబీ చైర్పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: రైతు రుణాలకు అత్యంత ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని డీసీసీబీ సిబ్బందిని ఆ బ్యాంక్ చైర్పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న బ్రాంచ్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రైతులకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, రికవరీ, డిపాజిట్లు తదితర వివరాలను బ్రాంచ్ మేనేజర్ సుజాతను అడిగి తెలుసుకున్నారు. ఖాతాదారులకు అందిస్తున్న ఆధునిక బ్యాంకింగ్ సేవలు, టర్నోవర్పై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డు, ఆప్కాబ్ అందిస్తున్న ప్రోత్సాహంతో బ్యాంకు పురోభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలన్నారు. స్వల్పకాలిక పంట రుణాలతో పాటు రైతులకు దీర్ఘకాలిక రుణాలు (టర్మ్లోన్లు) విరివిగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయక మేనేజర్లు శిరీష, స్వర్ణలత పాల్గొన్నారు.

తోడల్లుడిపై హత్య కేసు నమోదు

కళ్యాణదుర్గం: దంపతుల మధ్య వివాదాన్ని సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కత్తితో దాడి చేసి, ఆయన మృతికి కారణమైన తోడల్లుడిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. వివరాలు... కళ్యాణదుర్గం మండలం తూర్పు కోడిపల్లికి చెందిన రాజన్న (42), సుకన్య దంపతులు. ఈ నెల 28న భర్త రాజన్నతో కలసి కళ్యాణదుర్గంలోని జయనగర్లో నివాసముంటున్న చెల్లెలు సరస్వతి ఇంటికి సుకన్య వచ్చారు. ఆ సమయంలో సరస్వతి, ఆమె భర్త సురేంద్ర ఘర్షణ పడుతుండడంతో రాజన్న సర్దిచెప్పబోయాడు. దీంతో ఆగ్రహానికి గురైన సురేంద్ర కత్తితో రాజన్నపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రాజన్నను వెంటనే స్థానిక సీహెచ్సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం రాత్రి బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. దీంతో సురేంద్రపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మహిళ మృతి

గుంతకల్లు: గుంతకల్లు–బళ్లారి సెక్షన్లోని సాకేబండ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతదేహం ఆనవాళ్లు చిక్కలేనంతగా ఛిద్రమైంది. దీంతో ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మహిళ మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే 94406 27667, 99661 44614లో సంప్రదించవచ్చు.

ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు మసూద్వలి

తాడిపత్రి అర్బన్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల గ్రామానికి చెందిన షేక్ మసూద్వలి(58)కి భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. లారీ డ్రైవర్గా జీవనం సాగిస్తున్న ఆయన మంగళవారం తాడిపత్రికి వచ్చాడు. నందలపాడులోని బంధువులను పలకరించి తన స్కూటీ వాహనంపై చుక్కలూరు వైపు బయలుదేరాడు. శ్రీనివాసపురంలోని శ్రీకృష్ణదేవరాలయ విగ్రహం సమీపంలో వాహన వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన ఉన్న సైడ్ కాలువలోకి దూసుకెళ్లాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమార్తె చాందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న ఆర్పీఎఫ్ ఐజీ


తీర్థప్రసాదాలు అందుకుంటున్న ఐజీ అరోమాసింగ్ ఠాగూర్

గుంతకల్లు రూరల్: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఐజీ అరోమాసింగ్ ఠాగూర్ మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను, స్వామి శేష వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యాన్ని ఆమె అడిగి తెలుసుకున్నారు.

గుంతకల్లు డివిజన్లో ఐజీ పర్యటన

గుంతకల్లు: ఆర్పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాగూర్ మంగళవారం గుంతకల్లు రైల్వే డివిజన్లో పర్యటించారు. గుంతకల్లుకు చేరుకున్న ఆమెకు ఆర్పీఎఫ్ డివిజనల్ కమిషనర్ మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని పరిశీలించారు. రైల్వే ఆస్తుల పరిరక్షణ, ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని జోన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన మహిళ ఆర్పీఎఫ్ బ్యారెక్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఆర్పీఎఫ్ ఏఎస్సీ బీఎస్ మిశ్రా, సీఐ పి.రమేష్గౌడ్ తదితరులు ఉన్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం

- ప్రజలను కోరిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెండేళ్లపాటు కోవిడ్ విపత్కర పరిస్థితులున్నాయని, అయినా సంక్షేమం ఆగలేదని, రెండున్నరేళ్లలో ఊహకందని అభివృద్ధి జరిగిందని, ఇదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 10వ డివిజన్ భవానీనగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లారు. ముందుగా 10వ డివిజన్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజక వర్గంలో లబ్ధిదారులకు అందించిన రూ.2,304 కోట్ల సంక్షేమం, రూ.1,045 కోట్ల అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించారు. నగరంలోని 50 డివిజన్లలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గతంలో కొన్ని సార్లు ప్రతి లబ్ధిదారుడి ఇంటికీ వచ్చినట్లు తెలిపారు. మరోసారి జగనన్నకు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవానీనగర్‌లో రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు ప్రజలే: కుల, మతాలకతీతంగా తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించి పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారని ఎమ్మెల్యే అన్నారు. మా పార్టీకి స్టార్ కాంపెయినర్లు ప్రజలేనని జగన్ చెబుతుంటే..చంద్రబాబు మాత్రం రాజకీయంగా నష్టపోయిన వాళ్లను స్టార్ క్యాంపెయినర్లుగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు లక్ష్మిదేవి, సుమతి, రాజేశ్వరి, సాకే చంద్ర, ఇసాక్, మల్లెమీద నరసింహులు, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, క్లస్టర్ అధ్యక్షులు ఓబిరెడ్డి, మధు, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంటమధు, లక్ష్మణ్, సీనియర్ నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, సైపుల్లాబేగ్, కృష్ణవేణి, రూరల్ కన్వీనర్ హుస్సేన్, నాయకులు రాధాకృష్ణ, వనారస బలరాం, రామయ్య, జోగి రాజేంద్ర, తిరుపాల్ రెడ్డి, నాగేంద్ర, రాధాయాదవ్, అంకిరెడ్డి ప్రమీళ, దేవి, శోభారాణి, శోభాబాయి, భారతి, ఉష పాల్గొన్నారు.

పార్టీలోకి టీఎన్‌టీయూసీ నాయకులు: టీఎన్‌టీయూసీకి మాజీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, తెలుగు యువత నాయకులు రవి, పవన్, రాఘవ, రాజు, లచ్చన్న గౌడ్, రామ్మోహన్ చౌదరి, భరత్, వినోద్, మోహన్, అనిల్‌లు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అనంత పార్టీ కండువా వేసి,ఆహ్వానించారు.

నేడు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ
నగరంలోని గుత్తి రోడ్డు 80 ఫీట్ రోడ్డు వద్ద బుధవారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.


వైఎస్సార్‌సీపీలోకి చేరిన వెంకటేష్‌గౌడ్‌కు కండువా వేస్తున్న ఎమ్మెల్యే అనంత


భవానీనగర్‌లో మహిళకు సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత

'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'కి స్పందన

అనంతరం ఎమ్మెల్యే అనంత మీడియాతో మాట్లాడారు. ఇంటింటికీ వతెస్సార్‌సీపీకి మంచి స్పందన వస్తోందన్నారు. మేం ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని ప్రజలు చెప్తున్నారన్నారు. జగన్ సీఎంగా ఉంటేనే తమ జీవితాలు బాగుపడుతాయని ప్రజలు విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ ఫ్రస్టేషన్‌లో ఉందని, 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు రానున్న ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని కుట్ర చేస్తున్నారన్నారు. టీడీపీ, బీజేపీతోడు జనసేన మద్దతుగా ఉన్నాయని, కానీ ఆ నాడు రాష్ట్రానికి ఎందుకు ప్రత్యేక హోదా తీసుకురాలేకపోయారో చెప్పాలన్నారు. గత ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణ మాఫీ, తదితర హామీలను విస్మరించి ప్రజలకు మోసం చేశారన్నారు. ఎన్టీఆర్‌ను గద్దె దించిన చంద్రబాబు అధికారంలోకొచ్చాక అప్పటి వరకు కిలో బియ్యం రూ.2 ఉంటే రూ.5.25కు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

క్లుప్తంగా

ఆర్టీసీ లీజు స్థలాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి సుమంత్

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం ఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాలను 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. మంగళవారం ఆర్‌ఎం కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించారు. బీటీటీ టెండర్లకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సురేంద్రబాబు, పర్సనల్ ఆఫీసర్ చంద్రాయుడు, డిపో మేనేజర్ నాగభూపాల్, 30 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

'ఆడుదాం - ఆంధ్రా'లో ప్రతిభ


జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావుతో ఖోఖో క్రీడాకారులు

అనంతపురం: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో 'ఖో-ఖో' పురుషుల విభాగంలో జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతపురం మేయర్ వసీం చేతుల మీదుగా కప్, మెడల్స్, సర్టిఫికెట్స్, రూ.35 వేల నగదు బహుమతిని అందుకున్నారు. కే.పవన్ కుమార్, టి. భవాని, శంకర్, అవినాష్, కే. ప్రవీణ్, పి.వంశీకృష్ణ, కే. దిలీప్, సూర్య, సాయితేజ అనే క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి అభినందించారు.

ఆత్మకూరులో వైఎస్సార్ ఆసరా రేపు

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఫిబ్రవరి 1న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత తెలిపారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు స్థలాన్ని పరిశీలించి, ఏర్పాట్లు చేశారు. వారు మాట్లాడుతూ 1న ఆత్మకూరులోని సర్దార్‌వలి దర్గా పక్కన పెట్రోల్ బంక్ దగ్గర మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్‌కుమార్ నాయక్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాల పోతన్న, మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, అతిక్‌రెడ్డి, నరసింహ, సుశీల, ఏపీఎం మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలి

అనంతపురం రూరల్: కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను అర్బన్ తహసీల్దార్ బాలకిషన్ మంగళవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎండీయూ ఆపరేటర్లు ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరు కావాలని సూచించారు.

పోలీసు శిక్షణ కళాశాల సందర్శన


ఫోరెన్సిక్ ప్రయోగశాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

అనంతపురం: పోలీస్ శిక్షణ కళాశాలలో ఉన్న ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీని విజయనగర న్యాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఫోరెన్సిక్ ప్రయోగశాల పనితీరు, సేవలను ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ జాయింట్ డైరెక్టర్ రంగనాథ రెడ్డి, ఓఎస్డీ సి. కొండా రెడ్డి, శాస్త్ర సహాయకులు సుధారాణి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఫోరెన్సిక్ సైన్స్ ద్వారా వివిధ నేరాల్లో సాక్ష్యాధారాల పరిశీలన, కోర్టుల్లో వాటి ఉపయోగం, బాలిస్టిక్ సైన్స్ తదితర అంశాలపై నిపుణులతో విషయ పరిజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగర లా కళాశాల ప్రిన్సిపాల్ హెచ్. రాఘవేంద్ర చార్, కళాశాల అధ్యాపకులు ఆర్. కల్పన, డాక్టర్ వాసవీలత, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదాం


మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి

అనంతపురం: సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పిలుపునిచ్చారు. నగరంలోని ప్రశాంతి సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య లీడర్లకు బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల్య వివాహాల నిలుపుదల నిబంధనలు - 2023, జీఓ నంబర్ 31,39 గురించి అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి అధ్యర్యంలో జరిగిన సమావేశానికి ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అధ్యక్షత వహించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నారీశక్తి తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ ఉండదన్నారు. పిల్లల హక్కులను కాపాడడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సామాజిక రుగ్మత అన్నారు. బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందన్నారు. బాల్య వివాహాలను అరికడుతున్నా ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయన్నారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బిడ్డ ఎదుగుదల, చదువుకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ దురాచారాన్ని రూపు మాపడానికి ప్రతి మండల సమాఖ్య సమావేశంలోనూ ఒక ఎజెండాగా అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ మంజునాథ్, డీఆర్‌డీఏ ఏపీడీ కృష్ణయ్య, జిల్లా సమాఖ్య ఏపీఎం అనిత, కోశాధికారి లలిత, అధ్యక్షురాలు షేకున్‌బీ, కార్యదర్శి రాధమ్మ, ఉపకార్యదర్శి సుజాత, సహాయ కార్యదర్శి సుహాసిని, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ వెంకట్‌కుమార్ పాల్గొన్నారు.

కోవిడ్ వారియర్స్ సేవలు మరువలేనివి


కోవిడ్ మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: కోవిడ్ వారియర్స్ సేవలు మరువలేనివని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రాష్ట్రంలో 122 మంది వైద్యులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అనంతపురంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు గంగులప్ప, కృష్ణమూర్తి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అభిషేక్, మాజీ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్, ఆర్ఎంఓ డాక్టర్ పద్మాజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్కూల్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం


క్రీడల విజేతలతో అడిషనల్ ఎస్పీ హనుమంతు, శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ హనుమంతు, శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటల్లోనూ రాణించాలని అన్నారు. శాస్త్రవేత్తలు, డాక్టర్లు మాత్రమే కాకుండా సమాజానికి క్రీడాకారుల ప్రాముఖ్యత ఎంతో అవసరమన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలు మానసికంగా ఎదగాలంటే విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించారు. కీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు తబస్సుమ్, శాంత, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డీన్లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, మహేష్, గంగాధర్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం


అనంతపురంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎల్ఎం ఉమాదేవి

అనంతపురం టవర్‌క్లాక్: జాతిపిత మహాత్మగాంధీ అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం మహత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సమీపంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మనోజ్, కొత్తూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు నరసింహులు, నాయకులు పోతుల సురేష్, జయంతి శ్రీనివాస్, కలవల సతీష్, భూపాలం కిశోర్, నాగభూషణం, కృష్ణయ్య, మేడా సురేష్, జనార్దన్, సత్రసాల మంజునాథ్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులు మహాత్మా గాంధీ
అనంతపురం: అహింసా విధానంతో దేశ స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అన్నారు. యావత్ దేశానికే కాకుండా అంతర్జాతీయ సమాజానికి మార్గదర్శకులుగా నిలిచిన దార్శనికుడు అని కొనియాడారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, ఉపగ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్, రామాంజనమ్మ, కావేరి, బాషా, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించి, ఆయన అడుగు జాడల్లో నడుద్దామని ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో ఏపీఓ పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రాము నాయక్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా సామగ్రి పంపిణీ


అగ్నిమాపక సిబ్బందికి భద్రతా సామగ్రిని అందిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి వి. శ్రీనివాస రెడ్డి

అనంతపురం: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఆర్జస్ స్టీల్ ప్లాంటు వితరణ చేసిన రూ.3,14,000 భద్రతా సామగ్రిని జిల్లా అగ్నిమాపక అధికారి వి. శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. అనంతపురంలోని జిల్లా అగ్నిమాపక అధికారి ప్రధాన కార్యాలయంలో గమ్‌బూట్లు, డ్రాగన్ సెర్చ్ లైట్స్, ఫైర్ సేఫ్టీ హెల్మెట్స్, ఫైర్మెన్ యాక్స్, ఫైర్ సేఫ్టీ గ్లావ్స్‌లను అగ్నిమాపక సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సహాయ అగ్నిమాపక అధికారి కేపీ లింగమయ్య, స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు మ్యాక్సీ ఫెర్నాండేజ్, నరేందర్, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా త్యాగయ్య ఆరాధన


పంచరత్న గాన సేవలో కళాకారిణులు

అనంతపురం కల్చరల్: త్యాగయ్య సంకీర్తనలతో మొదటిరోడ్డులో కాశీవిశ్వేశ్వరాలయం మార్మోగింది. మంగళవారం శ్రీవిజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి 177వ ఆరాధన మహోత్సవం వీనుల విందుగా సాగింది. నిర్వాహకులు మొదలి మురళీకృష్ణ నేతృత్వంలో నగరంలో కొలువుదీరిన ఏకైక త్యాగరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం త్యాగరాజ స్వామికి పంచామృతాభిషేకాలు, సంగీత విద్వాంసుల చేత పంచరత్న గాన సేవలు జరిగాయి. బెంగళూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు అభిరామ్ బృందాలు త్యాగయ్య కీర్తనలతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. స్థానిక సంగీత కళాకారులు లతాశ్యామ్, రమామణి, శ్రీదేవి, వైదేహిచైతన్య తదితరులు కర్ణాటక కచేరీ చేశారు. విశ్వజిత్ వయోలిన్‌పై, సునీల్ సుబ్రమణ్యం మృదంగంపై, కార్తీక్ కంజీరాపై వాయిద్య సహకారం అందించారు.

నేటి నుంచి 'జగనన్న జయకేతనం' ప్రదర్శనలు


జగనన్న జయకేతనం నాటక ప్రదర్శనలోని ఓ ఘట్టం (ఫైల్)

అనంతపురం కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో 'జగనన్న జయకేతనం' పేరుతో నాలుగేళ్లుగా గ్రామాల్లో నాటికలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. నవరత్నాల పేరిట అందిస్తున్న పథకాలు, వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిబద్ధత తెలిపే అంశాలతో ఈశ్వరయ్య, ఇజ్రాయెల్ రాసిన పద్య నాటకాన్ని ప్రదర్శిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. ఈ ఏడాది సైతం వినూత్న రీతిలో బుధవారం నుంచి అనంతపురం రూరల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నాటికల ప్రదర్శనకు నిర్వాహకులు, నటీనటులు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి నాటక ప్రదర్శనలు :
శ్రీ సత్యసాయిబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు రూరల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. 31న ఉప్పరపల్లి, ఫిబ్రవరి 1న ఆత్మకూరు, 2న ససప, 3న, అనంతపురం 4న కనగానిపల్లి, 5న వేపకుంట, 6న పేరూరు, 7న తగరకుంట, 8న నార్పింపల్లి, 9న వెంకటాంపల్లిలో జగనన్న జయకేతనం నాటకాన్ని ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించాలి
మా కుటుంబానికి దశాబ్దాలుగా జిల్లా నాటక రంగంతో అనుబంధం ఉంది. పెరిగిపోతున్న సాంకేతికత ప్రభావం సినిమా, టీవీలు, మొబైల్స్ రూపంలో నాటకాన్ని మరుగున పడేశాయి. అయితే నాటకంలో విషయం ఉంటే ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి చూస్తారనని చెప్పడానికి నిదర్శనం జగనన్న జయకేతనం నాటకం. ఈ నాటక ప్రదర్శనలను రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో పదిరోజుల పాటు ప్రదర్శించనున్నాం.
- మైఖేల్‌బాబు, నాటక ప్రదర్శన సమన్వయకర్త

పరిశోధన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నెలకొన్న పరిశోధన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. థీసిస్ సమర్పించి ఏడాది గడిచినా వైవా నిర్వహించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశోధన విద్యార్థులు ఆర్అండ్‌డీ విభాగానికి తిరిగి సమస్యలు మొరపెట్టుకున్నా వినేవారే లేరన్నారు. 50 మంది పరిశోధన విద్యార్థులకు వైవా నిర్వహించకపోవడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో లేని ఫారిన్ ఎవాల్యుయేషన్స్ విధానాన్ని ఎస్కేయూలో అమలు చేయడం గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఇబ్బంది గురిచేయడమేనన్నారు. ఇండస్ట్రీ కోటాలో పీహెచ్‌డీ అడ్మిషన్ తీసుకున్న వారికి కనీసం ఫ్రీ పీహెచ్‌డీ ఫీజు సైతం కట్టించుకోనివ్వకుండా వేదనకు గురిచేస్తున్నారన్నారు. నూతన వీసీ ఇప్పటికైనా పరిశోధన విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నడిపన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఊబిచెర్లకు చెందిన నడిపన్న గుత్తి నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామ శివారులో వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నడిపన్నను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వినియోగంలోకి ధోబీఘాట్


కొత్త బోరు బావి నుంచి వస్తున్న నీరు

రాప్తాడు: నిరుపయోగంలో ఉన్న ధోబీఘాట్ వినియోగంలోకి వచ్చింది. ఈ నెల 24న ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో రజకులు ధోబీఘాట్ సమస్యను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. బోరు బావిని తవ్విస్తే వినియోగంలోకి వస్తుందని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. సొంత నిధులతో ఉచితంగా బోరు వేయించారు. దీంతో బోరు బావిలో 3 ఇంచుల నీరు పడింది. పైపులైన్ కూడా ఏర్పాటు చేయించారు.

అంగన్‌వాడీ యూనియన్‌కు అధ్యక్షురాలు రాజీనామా

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ హెల్పర్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)కు రాజీనామా చేస్తున్నానని అర్బన్ అధ్యక్షురాలు జయభారతి ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేశానని, పోరాటాలు, నిరసనలు, దీక్షల్లో పాల్గొన్నట్లు గుర్తు చేశారు. అయితే అర్బన్ కార్యదర్శి జమున వ్యవహారశైలి నచ్చక వైదొలుగుతున్నట్లు ప్రకటించారు.

విద్యుత్ చార్జీల పెంపుదలను విరమించుకోవాలి

అనంతపురం టౌన్: విద్యుత్ చార్జీలు పెంపుదలను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. మంగళవారం విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ సిఫార్సు మేరకు విద్యుత్ చార్జీల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల నుంచి ప్రజాభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపుతో ఇప్పటికే ప్రజలపై పెనుభారం పడిందన్నారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని సీపీఎం అందజేసిన నివేదికను పరిశీలించాలని కోరారు. సీపీఎం నాయకులు నల్లప్ప, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేద్దాం

రామగిరి: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల వ్యాప్తంగా పంచాయతీలు పేరూరు, గంతిమర్రి, రామగిరి, పెద్ద కొండాపురం, ఎంసీపల్లి, మా దాపురం, నసనకోట, పోలేపల్లి, కుంటిమద్ది గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ప్రజలకు ఏమాత్రం న్యాయం జరగలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండడంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులకు హంద్రీ నీవా నీటిని తీసుకొచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి కుల, మత, ప్రాంతాలకతీతంగా అందరికీ అందేలా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి, సర్పంచులు , ఎంపీటీసీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



కనగానపల్లి: ముక్తాపురం వద్ద వ్యవసాయ పొలాల్లో 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, అందులోని 100 లీటర్ల డీపీ ఆయిల్, కాపర్ వైరు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు చెన్నేకేశవులు, చంద్రశేఖర్, రాజా, రామచంద్ర వాపోయారు. దీనిపై కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ బోనాల పండుగ

గార్లదిన్నె: మండల కేంద్రంలో మంగళవారం గ్రామస్తులు పెద్దమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో మహిళలందరూ డప్పు వాయిద్యాల నడుమ పెద్దమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు.